క్లుప్తంగా

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూదేవి, అలివేలి మంగమ్మ సమేత కోనా వేంకటేశ్వర స్వామి మూల విగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున కొండపైకి చేరి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

మృతదేహం లభ్యం

పాణ్యం : మండల కేంద్రమైన పాణ్యంలోని ఎస్సార్బీసీ ప్రధాన కాల్వలో గత మూడు రోజుల క్రితం ప్రమాదవశాత్తు జారి పడి గల్లంతైన యువకుడి మృతదేహం శనివారం లభ్యమైంది. ఏఎస్ఐ ఫజులుల్లా తెలిపిన వివరాల మేరకు.. బేతంచెర్ల మండలం, గోరుమాన్‌కొండకు చెందిన రామశివుడు, శ్రీదేవిల కుమారుడు శివ జగదీష్(24) మూడు రోజుల క్రితం ఎస్సార్బీసీ ప్రధాన కాల్వలో జారి పడి గల్లంతయ్యాడు. అచూకీ కోసం రెండు రోజుల పాటు గాలింపు చర్యలు చేపట్టగా శనివారం ఉదయం రైల్వే బ్రిడ్జి సమీపంలోని కాల్వలో మృతదేహం తెలియాడుతూ కనిపించగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న శివజగదీష్ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

పశువులకు టీకాలు వేయాలి



గొంతువాపు టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

గడివేముల: పశువులకు సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున టీకాలు వేయాలని పాణ్యం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్ సూచించారు. శనివారం గడివేముల, బూజునూరు గ్రామాల్లో పశువులకు వేస్తున్న టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఐదు రోజుల క్రితం గ్రామంలో ఆకస్మికంగా పశువులు చనిపోవడంతో తగు చర్యలు తీసుకోవాలని పశువైద్య సిబ్బందిని ఆదేశించారు. అనారోగ్యంతో ఉన్న పశువుల రక్తాన్ని సేకరించి ల్యాబ్‌కు పంపి పరీక్షలు చేయించాలన్నారు. అవసరమైన పాడి రైతులకు ఉచితంగా మందులను పంపిణీ చేయాలన్నారు. గ్రామాల్లో గొంతు వాపు టీకాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారిణి డాక్టర్ సాయి హరిణి, డాక్టర్ కార్తీక లక్ష్మి, రవి తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలుగా పింఛన్ల తొలగింపు

కల్లూరు: ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే అన్ని కేటగిరీల పింఛన్లు పెంచుతామని కూటమి నేతలు ప్రచారం చేశారు. దీంతో పింఛన్‌దారులు ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారు. అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పింఛన్‌దారుల ఏరివేతకు పూనుకుంది. కూటమి ప్రభుత్వం సరికొత్త నిబంధనలు తెరపైకి తీసుకొచ్చి పింఛన్లలో కొర్రీలు పెడుతోంది. మీ వైకల్య అర్హతను నిరూపించుకోవాలని మండలంలో 193 మంది దివ్యాంగుల పింఛన్‌దారులకు నోటీసులు ఇచ్చారు. నోటీసులు పొందిన వారిలో అర్హతలను బట్టి వృద్ధాప్య, వితంతు, వైకల్య పింఛన్లుగా మార్పులు పొందినట్లు సమాచారం. రూ.15వేలు పింఛన్ పొందుతున్న వారు వైకల్యం పింఛన్‌తో రూ. 6వేలు, వృద్ధాప్య, వింతతు పింఛన్‌దారులకు రూ. 4వేలు పింఛన్ దారులుగా మారనున్నారు.

15 మంది టౌన్ ప్లానింగ్ కార్యదర్శులకు మెమోలు

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో పనిచేసే 15 మంది టౌన్ ప్లానింగ్ కార్యదర్శులకు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ శనివారం మెమోలు జారీ చేశారు. భవన యజమానులు ఆన్‌లైన్‌లో బిల్డింగ్ అప్లికేషన్లు పెట్టుకొని 20 రోజులు గడుస్తున్నా ప్లానింగ్ కార్యదర్శులు పట్టించుకోలేదు. పెండింగ్ దరఖాస్తులపై ఈనెల 6వ తేదీన కమిషనర్ టౌన్ ప్లానింగ్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అయినా ఇప్పటివరకు బిల్డింగ్ దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో కమిషనర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు షేక్ అమ్జద్ బాషా, ఎం.దివాకర్ నాయుడు, జి.మద్దయ్య, వి.రఘునాథ్ రెడ్డి, కె.నరేష్, బోయ పవన్ కుమార్, కె.ఉమాశంకర్ రెడ్డి, ఎస్.లక్ష్మీనరసింహ రాజు, పరంధాములు, శ్రీహరి కుమార్, బొబ్బల మౌనిక, పి.ఖాశీం, కె.సంజీవ కుమార్, శాంతి మధు, సి.స్వాతిలకు మెమోలు జారీ చేశారు. బిల్డింగ్ అప్లికేషన్లను ఎందుకు త్వరగాపరిష్కరించలేదో మూడు రోజు ల వ్యవధిలో తెలియజేయాలని, లేని పక్షంలో శాఖ పర చర్యలు తప్పవని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత
- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కోడుమూరు రూరల్: వానలు పడుతున్న వేళ జిల్లాలోని గ్రామాల్లో నెలకొన్న పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శనివారం గూడూరు మండలం కె.నాగలాపురం గ్రామంలో జరిగిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి మొక్కలు నాటారు. అనంతరం ప్రజలనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో నీటి నిల్వ వల్ల దోమలు విపరీతంగా వ్యాప్తి చెందే ప్రమాదముందని, ముందు జాగ్రత్తగా ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రజలు కూడా తమ వంతుగా పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయడంతో పాటు, చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా చెత్త సేకరణ రిక్షాల్లో వేయాలని సూచించారు. గ్రామాల్లోని మంచి నీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకోసారి విధిగా శుభ్రం చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటినందించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఏవైనా తాగునీటి సమస్యలున్నా, సీసీ రోడ్లు అవసరమైనా వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేసి, చెడిపోయిన గుడ్లను గుర్తించి నివేదిక పంపించాలని అంగన్‌వాడీ సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలోని జగనన్న కాలనీని సందర్శించి ఇళ్ల నిర్మాణాల పురోగతిపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సందీప్‌కుమార్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, హౌసింగ్ పీడీ చిరంజీవి, సర్పంచు నాయోమి, తహసీల్దార్ వెంకటేష్ నాయక్, ఎంపీడీఓ మధులత పాల్గొన్నారు.

ఒరిగిపోతున్నా.. పట్టుకోండి!



పొలంలో విద్యుత్ స్తంభం ఒరిగిన దృశ్యం

ఓర్వకల్లు : జోరుగా కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభాలు ఒరిగిపోతున్నాయి. దశాబ్దాల క్రితం విద్యుత్ శాఖ వారు నన్నూరు గ్రామం నుంచి లొద్దిపల్లె గ్రామానికి విద్యుత్ సరఫరా నిమిత్తం వేసిన విద్యుత్ స్తంభాలకు 11కేవీ సామర్థ్యం గల విద్యుత్ తీగలను అమర్చారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షానికి భూమిలో తేమశాతం అధికమై, తీగలు బరువెక్కడంతో అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు పాక్షికంగా నేలకొరిగాయి. అటుగా వెళ్లిన పశువులు స్తంభాన్ని తాకితే విద్యుత్ ప్రమాదం జరిగే అవకాశం ఉంది. రోడ్డు పక్కనే ఓ స్తంభం ఓ వైపు వాలి ఉండటంతో నిత్యం అటువైపు ప్రయాణించే వందలాది వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రమాదం చోటుచేసుకోక ముందే అధికారులు స్పందించి పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు





కొమ్ముచెరువులో స్వాముల వారి దర్శనార్థం గుమికూడిన భక్తులు, భజనగీతాలు ఆలపిస్తున్న భజన కళాకారులు

ఓర్వకల్లు : శ్రావణ మాసం ముగింపు సందర్భంగా అమావాస్య పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లోని ఆంజనేయస్వామి దేవాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లి స్వాముల వారిని దర్శించుకొని, కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొమ్ముచెరువు, కాల్వ, బొడ్డువానిపల్లె గ్రామ శివారులో వెలసిన ఆంజనేయస్వామి దేవాలయాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ అర్చకులు శివయ్య శర్మ, జంధ్యాల మనోహరశర్మ, జంధ్యాల శశిధరశర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వాముల వారికి సుప్రభాత సేవ, అభిషేకం, అర్చనలు నిర్వహించి, విశిష్ట పూజలు చేశారు. అనంతరం స్వాముల వారికి నైవేద్యాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. బొడ్డువానిపల్లె ఆంజనేయస్వామి దేవస్థానంలో నన్నూరు భజన సంఘం వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. అలాగే వేర్వేరు ప్రాంతాలకు చెందిన రంగస్థల కళాకారులు ప్రదర్శించిన భక్త చింతామణి, సుభద్రరాయబారం, బాలనాగమ్మ, శ్రీకృష్ణరాయబారం, రామాంజనేయ యుద్ధం నాటకాల్లో పలు ఘట్టాలు చూపరులను అలరింపజేశాయి. దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

టంగుటూరికి ఘన నివాళి



టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారిణి కౌసల్య

ఓర్వకల్లు : మండలంలోని నన్నూరు శాఖా గ్రంథాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి ఘన నివాళి సమర్పించారు. శనివారం ప్రకాశం పంతులు 153వ జయంతి సందర్భంగా గ్రంథాలయాధికారిణి కె.కౌసల్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక పాఠశాల విద్యార్థులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు

విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరిపించాలి



కళాశాల వద్ద తల్లిదండ్రులతో కలిసి ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పాణ్యం : ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు పిట్టలా రాలిపోతున్నారని, కళాశాలలో విద్యార్థుల ఆత్మహత్యలపై సీబీఐ విచారణ చేపట్టాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం భానుప్రకాష్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడంలో కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం ఉందన్నారు. సకాలంలో హాస్టల్‌లో పర్యవేక్షణ లేదని చెప్పారు. అంతేకాక విద్యార్థి ఉదయం ఆత్మహత్యకు పాల్పడితే మధ్యాహ్నం తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. భానుప్రకాష్ ఆత్మహత్యకు కారణమైన వార్డెన్, పర్యవేక్షణ అధికారులపై కేసు నమోదు చేయాలని, కళాశాల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థి తల్లిదండ్రులతో కలిసి గేటు వద్ద నిరసన చేపట్టారు. నిరసనలో ఏఐఎఫ్‌బీ నాయకులు వెంకటాద్రి, రాయలసీమ విద్యార్థి సంఘం నాయకులు రవీంద్ర, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ప్రతాప్, చిరు తదితరులు పాల్గొన్నారు.

మహిళా జైలు ఆకస్మిక తనిఖీ

కర్నూలు: నగరంలోని మహిళా కారాగారాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం ఉదయం మహిళా జైలుకు చేరుకుని ఖైదీలకు అందించే ఆహారం, రేషన్, వారి ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఖైదీలకు న్యాయవాదులు లేకుంటే న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. 70 ఏళ్ల వయస్సు పైబడిన ఖైదీలకు, అనారోగ్యంతో బాధ పడేవారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని, త్వరగా బెయిల్ మంజూరయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఖైదీలను కోర్టు వాయిదాలకు ఖచ్చితంగా హాజరుపరచాలని ఆదేశించారు. జైలు అధికారుల నుంచి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని మహిళా ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ న్యాయవాది సులోచనతో పాటు జైలు అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



గూడూరులో వినాయకుడి ఉత్సవాలపై చర్చిస్తున్న పోలీస్ అధికారులు

కోడుమూరు రూరల్: వినాయక చవితి సందర్భంగా గూడూరు మండలంలో జరిగే వినాయకుడి ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని కోడుమూరు సీఐ తబ్రేజ్ సూచించారు. శనివారం గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేష్ నాయక్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో సీఐ తబ్రేజ్, గూడూరు ఎస్ఐ చిరంజీవి, ట్రైనీ ఎస్ఐ మణికంఠ, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు సమావేశం నిర్వహించి వినాయకుడి ఉత్సవాలపై చర్చించారు. సీఐ మాట్లాడుతూ ఈనెల 27 నుంచి నిర్వహించే వినాయకుడి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. వినాయకుడి ఉత్సవాలను 3రోజుల్లో ముగించాలని కమిటీ సభ్యులకు సూచించగా, ఐదు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించుకునేందుకు అనుమతి నివ్వాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ విషయంపై జిల్లా అధికారులను కలవాలని సీఐ వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. కాగా మండలంలో వినాయక మండపాల ఏర్పాటుపై పోలీసులకు తప్పనిసరిగా సమాచారమివ్వడంతో, ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సీఐ కోరారు. ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా అలజడులు సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరికలు జారీ చేశారు.

చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

ఓర్వకల్లు : ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబునాయుడు అన్నారు. చవితి వేడుకల సందర్భంగా నియమ, నిబంధనలపై శనివారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో మతాలకతీతంగా శాంతియుత సమావేశం నిర్వహించారు. ఎస్ఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సీఐ చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మట్టితో తయారు చేసిన వినాయకుని విగ్రహాలను మాత్రమే ప్రతిష్టించుకోవాలన్నారు. వివాద రహితమైన ప్రదేశాలలో మండపాలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి మండపానికి సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలని సూచించారు. వాంఛనీయ ఘటనలు జరుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉత్సవ కమిటీ సభ్యులదేనన్నారు. సమావేశంలో ఎస్ఐ సునీల్ కుమార్, ట్రైనీ ఎస్ఐ అఖిల్ కుమార్, వివిధ గ్రామాల పెద్దలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ చంద్రబాబు నాయుడు

గడివేముల: మండలంలోని గ్రామాల్లో వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలని తహసీల్దార్ వెంకటరమణ, ఎస్ఐ నాగార్జున రెడ్డి సూచించారు . శనివారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో వినాయక చవితి పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతంగా చేసుకోవాలన్నారు. గణేష్ ప్రతిమలు ఏర్పాటు చేసుకునేవారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. డీజే మ్యూజిక్, డాన్సులు వంటివి ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్, ఎంపీడీఓ , ఎంఈఓ

సి.బెళగల్: వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ రాణెమ్మ అన్నారు. శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల అధికారులతో కలిసి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరోగ్యం – పరిశుభ్రత అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అధికారులు విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై డెమో నిర్వహించి, ఆరోగ్య విషయాలను వివరించారు. భోజనానికి ముందు, మల, మూత్ర విసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని వైద్య సిబ్బంది విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్, సర్పంచ్ పాండురంగన్న తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పాణ్యం : వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుందని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం కొణిదేడు గ్రామంలో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించి ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరుగా అందించాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈఓ కోటయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

25న నగరపాలక సర్వసభ్య సమావేశం

కర్నూలు (టౌన్) : ఈనెల 2వ తేదీ అనివార్య కారణాలతో వాయిదా పడిన నగరపాలక సంస్థ పాలకవర్గ సర్వసభ్య సమావేశం తిరిగి ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ పి. విశ్వనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక ఎస్‌బీఐ కాలనీలో ఉన్న నూతన కౌన్సిల్ హాలులో ఈ సమావేశం జరుగుతుందన్నారు. గత సమావేశంలో చర్చించని అంశాలపై పాలకవర్గం ఈ సమావేశంలో చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటుందని ఆయన తెలిపారు.

నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుదాం



ఎస్‌టీపీల ఏర్పాటుపై ఇంజినీర్లకు సలహాలు, సూచనలు ఇస్తున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు (టౌన్) : నగరాన్ని స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దుదామని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. శనివారం స్థానిక జమ్మిచెట్టు, సంకల్‌బాగ్, ఓల్డ్ పంప్ హౌస్ వద్ద ఉన్న మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మురుగు నీటి శుద్ధి కేంద్రాల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించే చర్యలు చేపట్టాలన్నారు. మరో ఎస్టీపీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మునగాల పాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలించిన కమిషనర్ నగరపాలక సంస్థకు చెందిన 135 ఎకరాల భూమిని సర్వే చేసి రక్షణ వలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్మార్ట్‌సిటీలో భాగంగా 5 పార్కుల అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, ఓఆర్ఆర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎంఈ మనోహర్ రెడ్డి, డీఈఈ గిరిరాజు, నరేష్, గంగాధర్ పాల్గొన్నారు.

ముందస్తుగా క్యాన్సర్‌ను గుర్తించేందుకే శిక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ మహేశ్వర ప్రసాద్

కర్నూలు(హాస్పిటల్): రోగుల్లో క్యాన్సర్ అనుమానిత లక్షణాలను ముందస్తుగా గుర్తించేందుకే మెడికల్ ఆఫీసర్లకు శిక్షణ ఇస్తున్నట్లు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మహేశ్వర ప్రసాద్ చెప్పారు. కర్నూలు మెడికల్ కాలేజీలోని ఆడిటోరియంలో అసంక్రమిత వ్యాధుల ఎన్‌సీడీ 4.ఓ క్యాన్సర్ నివారణపై పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యాధికారులకు రెండోరోజు శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ మహేశ్వరప్రసాద్ మాట్లాడుతూ క్యాన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తించి స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రికి ప్రతి మంగళ, గురువారాల్లో నిర్వహించే ఓపీ నెంబర్ 222కు పంపాలని వైద్యులకు సూచించారు. అసంక్రమిత వ్యాధులతోనే అధికంగా మరణాలు సంభవిస్తున్నాయని, 30 ఏళ్లు దాటిన వారిలో బీపీ, షుగర్ వంటి సమస్యలు వస్తున్నాయని, మహిళల్లో క్యాన్సర్ ముప్పు అధికంగా ఉందని తెలిపారు. అసంక్రమిత వ్యాధులు సంక్రమించిన వారు ఆరోగ్యంగా కనిపిస్తున్నా శరీరం లోపల గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, నేత్రాలు వంటి కీలక అవయవాల పనితీరు మందగిస్తుందన్నారు. సకాలంలో గుర్తించకపోతే జీవితాంతం తీవ్ర సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. శరీరంలో ఎక్కడైనా పుండు ఏర్పడి అది తగ్గకపోవడం, పుట్టుమచ్చలు రంగు మారడం, పరిమాణంలో మార్పులు, మల, మూత్ర సమయాల్లో మార్పులు, రక్తం పడటం, విరేచనం నల్లగా మారడం, మింగడం కష్టంగా అనిపించడం, అరుగుదల సరిగ్గా లేకపోవడం, మహిళల్లో అసాధారణ రక్తస్రావం, తెలుపు అధికంగా కావడం , శరీరంలో ఏ భాగంలోనైనా వాపు, గడ్డలు రావడం , బరువు తగ్గడం, రక్తహీనత, గొంతు బొంగురు పోవడం, ఎడతెగని దగ్గు వంటి లక్షణాలు ఉంటే అది క్యాన్సర్ కావచ్చని చెప్పారు. ఇలాంటి వారు వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్, ఆర్‌కేఎస్‌కే కన్సల్టెంట్ మల్లికార్జున, ఫైనాన్స్ కన్సల్టెంట్ అరుణ, ప్రాజెక్టు నిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ కోత

కర్నూలు(అగ్రికల్చర్): వినాయక చవితి, నిమజ్జనం కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సబ్ స్టేషన్లు, లైన్‌లలో అభివృద్ధి పనులు చేపడుతున్నందున ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కర్నూలు అర్బన్ డీఈఈ నాగప్రసాద్ తెలిపారు. పెద్ద మార్కెట్, సుబేదార్ స్ట్రీట్, ఉర్దూఘర్ ఏరియాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

పనిచేయని బ్యాటరీలు

- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సేవలకు తరచూ అంతరాయం



కరెంట్ లేక సేవలు నిలిచిపోవడంతో బయట వేచి ఉన్న వినియోగదారులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కరెంట్ పోయిన సమయంలో పనిచేసే బ్యాటరీలు గత 10రోజుల నుంచి పనిచేయడం లేదు. దీంతో కరెంట్ పోతే చాలు కంప్యూటర్లు సైతం బంద్ అవుతున్నాయి. ఈ మధ్య కాలంలో పట్టణంలో పగటి సమయంలో గంటల తరబడి అనధికారిక కరెంట్ కోతలను విధిస్తున్నారు. కరెంట్ లేకపోవడం, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో బ్యాటరీలు పనిచేయక పోవడంతో తరచూ రిజిస్ట్రేషన్లు నిలిచిపోతున్నాయి. స్లాట్ విధానం వల్ల కరెంట్ పోయి వచ్చేలోగా రిజిస్ట్రేషన్లు చేయించుకునే వినియోగదారులకు సంబంధించిన స్లాట్ టైం ముగిసిపోతుండడతో ఇటు వినియోగదారులతో పాటు, అటు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరెంట్ లేని సమయంలో స్లాట్ బుక్ చేసుకున్న వినియోగదారుల టైం ముగిసిపోతుండడంతో వారి రిజిస్ట్రేషన్లను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది సాయంత్రం వేళలో చేస్తున్నా గంటల తరబడి వేచివుండాల్సి రావడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది మాట్లాడుతూ బ్యాటరీలు పనిచేయడం లేదని, కొత్త బ్యాటరీల కోసం ఆర్డర్ పెట్టామని, బ్యాటరీలు వచ్చిన వెంటనే సమస్య పరిష్కారమవుతుందని పేర్కొన్నారు.

దారంతా గుంతలమయం





గుంతలమయంగా మారిన లక్ష్మీపురం రోడ్డు

కల్లూరు: కల్లూరు అర్బన్ 28వ వార్డు పరిధి లక్ష్మీపురం గ్రామానికి వెళ్లే దారంత గుంతలమయంగా మారింది. 44వ జాతీయ రహదారి నుంచి హంద్రీనది బ్రిడ్జి వరకు గుంతల ఉండడంతో పాటు అక్కడక్కడ కంకర తెలింది. ఈ రోడ్డుపై నిత్యం లక్ష్మీపురం, దొడ్డిపాడు గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం కర్నూలుకు వెళ్లే వారు ప్రయాణిస్తుంటారు. రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు. 44వ జాతీయ రహదారి నుంచి బస్టాప్ నుంచి లక్ష్మీపురం గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. లక్ష్మీపురం గ్రామానికి చెందిన రైతులు ఎద్దుల బండ్లు, వ్యవసాయ పనిముట్లతో గుంతలమయంగా మారిన రోడ్డుపై ప్రయాణించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కింద పడి గాయాలపాలయ్యే ప్రమాదం ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని ప్రయాణికులు, లక్ష్మీపురం గ్రామస్తులు కోరుతున్నారు.